

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## మారు

**లాఠీ దెబ్బలు తగిలిన చేతులకి** ఆయింట్‌మెంట్ రాసుకుంటున్న సమత తలుపు చప్పుడు విని తలెత్తి చూసింది.

మానిని విసురుగా లోపలకి వచ్చి చప్పుడయ్యేలా తలుపు మూసింది.

"ఏమైంది?" సమత చీర కొద్దిగా పైకెత్తి మోకాళ్ళ మీద ఆయింట్‌మెంట్ రాసుకుంటూ అడిగింది.

మానిని ఆ ప్రశ్నకి సమాధానం చెప్పకుండా వెటకారంగా అడిగింది.

"దెబ్బలు బాగా తగిలినట్లున్నాయే! మీ ధర్నా సక్సెస్ అన్నమాట. మీకు న్యాయం జరిగిపోయింది."

"వ్యంగ్యం అవసరంలేదు. ధర్నాలతో ఏ న్యాయం జరగదు. కాకపోతే విషయం ప్రజల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి వెళ్తుందంతే. సమత సహనంగా చెప్పింది.

"వెళ్తే? న్యాయం జరుగుతుందా? అదే రోజు ఏ సెలబ్రిటీ పెళ్ళో అయితే ఈ వార్త నాలుగు లైన్స్‌లో కూడా రాదు. వచ్చినా ప్రజలు ఏం చేయగలరు? పేపర్ మడిచేయగానే మర్చిపోతారు. టైం వేస్ట్ ధర్నాలు" కోపంగా చెప్పి మానిని తన గదిలోకి వెళ్ళింది.

ఐదు క్షణాల్లో వెనక్కి వచ్చి క్రోధంగా అడిగింది.

"నా మంచం మీద పడుకున్న ఆ యానిమల్ ఎవరు?"

"ష్. నెమ్మది. నాన్నవాళ్ళ ఊరివాళ్ళు. వాళ్ళకే ఏదో అన్యాయం జరిగితే ధర్నా చేసి వచ్చాం" సమత గొంతు తగ్గించి చెప్పింది.

"చేసారు. సరే. రోడ్ మీదనించే పంపేయాలి కదా? ఇంటికి తీసుకొచ్చి నా గదిలో పడుకో పెట్టాలా? మీ గది ఇవ్వచ్చుగా?" మానిని అరిచింది.

"ష్! ఏంటా అరుపులు? నీ సంస్కారం ఏమైంది?" అందులోనూ ఉన్నారు సమత కటువుగా హెచ్చరించింది.

"ఏం? జంతువు అంటే, కులం పేరుతో దూషించానని జైల్లో పెట్టిస్తారా? అమ్మా ఇదే చెప్తున్నాను. నువ్వుకాని, నాన్న కాని ఇలా జనాలని తెచ్చి ఇంటిని ధర్మ సత్రం చేస్తే మాత్రం ఊరుకునేదిలేదు. ఈ దెబ్బలు నిన్ను అప్పుడే అమ్మమ్మ తాతయ్య కొట్టివుంటే బాగుండేది."

"తల్లిని పట్టుకుని ఎంతమాటన్నావే?" సమత నిర్ఘాంతపోయింది.

"ఏ కోణంలో నువ్వు తల్లివి? ఆలోచించు. కేవలం నేను 'అమ్మా' అని పిలుస్తున్నా కాబట్టి తల్లిని అనుకుంటున్నావు అంతే. నెలల పిల్లని వదిలేసి ఊరిమీద పడ్డావు. నాన్నేమో ఐదువందల సర్కులేషన్ కూడా లేని ఆ న్యూస్ పేపర్‌కి ఎడిటర్‌గా గాడిద చాకిరి చేస్తున్నారు – అదీ జీతం భత్యం లేకుండా. కూతుర్ని కన్నాం, దీనికి మంచి భవిష్యత్తు ఇవ్వాలి అన్న ఏంగిల్ లో మీరిద్దరూ ఆలోచించారా? అమ్మమ్మ చూసుకోకపోతే నాగతి ఏమయ్యేదో. మీలాగా ఓచిన్న ఎర్రజెండా పట్టూకుని బయలుదేరేదాన్నేమో."

కూతురి అభియోగాలకి సమత నిశ్చేష్టురాలైంది.

"అంటే మేం మంచి పేరెంట్స్ కాదనా నువ్వు చెప్పేది?" కోపంగా అడిగింది.

"అవును. మీకు మీ అధోజగత్ సహోదరుల మీద తప్పించి కూతురి మీద ప్రేమలేదు. ఏదైనా ఇంటినించి మొదలవ్వాలి. నువ్వు ఇల్లు గురించి ఏనాడైనా పట్టించుకున్నావా? తాతయ్య చక్కగా చదివి మంచి ఉద్యోగంలో చేరాలని అనుకుంటే, డిగ్రీలోనే నాన్నని ప్రేమించి పెళ్ళి చేసుకుని పక్కదారి పట్టావు. ఇద్దరూ కలిసి తాతయ్య ఆస్తిని నాశనం చేసారు, చేస్తున్నారు. ఈ ఇల్లు నా పేరు పెట్టకపోతే దాన్నీ పార్టీకి రాసిచ్చేవాళ్ళే."

మానిని దుఃఖంతో ఓ నిమిషం ఆగి చెప్పింది.

"ఇంట్లో ప్రైవసీలేదు. ఎప్పుడూ గుంపులుగా జనాలు. వాళ్ళకోసం మీ పోరాటాలు. అందువల్ల లాభం ఏంటమ్మా? నాకు 'మారు' అని పేరు పెట్టావు. 'మారు' అనేది పేరా అమ్మా? స్కూల్లో ఎంత ఏడిపిస్తారు? తాతయ్య మానిని అని మార్చాడు. అంటే గొప్ప స్త్రీ అని చెప్పాడు. ఆయన కోరికని నువ్వు నెరవేర్చలేదు. నేనైనా దాన్ని సాధిద్దాం అంటే"

మానిని ఏడుపు వెక్కిళ్ళలోకి మారింది.

"ఇవాళ క్లాస్‌లో 'డిగ్రీ తర్వాత ఏం చేస్తార'ని మాస్టారు అడిగారు. నేను ఐ.ఏ.ఎస్‌కి ప్రిపేర్ అవుతానంటే ఆయన నవ్వి ఏమన్నాడో తెలుసా?"

"ఏమన్నాడు" సమత అయోమయంగా అడిగింది.

"చదివి సాధించినా, బేక్‌గ్రౌండ్ చెక్ ఉంటుందమ్మా. మీ పేరెంట్స్‌కి మార్కిస్ట్ బేక్‌గ్రౌండ్ ఉందంటే నువ్వు క్వాలిఫై అవవు' అని చెప్పారు."

"అంత మాటన్నారా?"

"అవును. వెళ్ళి యు.పి.యస్.సి ముందు ధర్నా చెయ్యి. మార్కిస్ట్‌ల పిల్లలకి ఐ.ఏ.ఎస్, ఐ.పి.ఎస్ ఇవ్వమను. నీ మూలంగానే అసలు నేను పుట్టకపోయినా బావుండేది" మానిని కళ్ళు తుడుచుకుని గట్టిగా చెప్పింది.

"నేనో అరగంటలో వస్తాను. ఈలోగా నా గదిలోని నీ సోదరుడ్ని, ఇంకా ఇంట్లో ఎంతమంది ఉన్నారో అంతమందిని పంపించెయ్. దుప్పట్లు మార్చి బాత్రూమ్స్ కడుగు. వాళ్ళని పంపడం ఇష్టంలేకపోతే నువ్వూ, మీ ఆయనా కూడా వెళ్ళిపోవచ్చు. నాకేం అభ్యంతరం లేదు."

"ఎన్నెన్ని మాటలంటున్నావు? మేం చేసిన త్యాగాలని పూచిక పుల్లతో సమానం చేసావు" సమత ఆక్రోశంగా చెప్పింది.

"ఏం త్యాగాలు చేసావు? ఏభై ఏళ్ళు వచ్చీ తండ్రి సంపాదించింది తింటున్నావు. నాన్నా అంతే. మామగారి మీద డిపెండెంట్. నీ సభలు సమావేశాలు, ధర్నాల వల్ల లాఠీ దెబ్బలు కాక ఏవైనా సాధించావా? మీ లీడర్స్ ఉపన్యాసాలు చెప్తారు. వాళ్ళ పిల్లల్ని జర్మనీ, రష్యా, అమెరికా పంపుతారు. మీ కార్యకర్తలు దెబ్బలు తినాలి. వాళ్ళు మైకుల ముందు మాట్లాడాలి. సమానత్వం ఉందా? ఇంకెక్కడి మార్క్సిజం అమ్మా? అది పుట్టిన రష్యాలో చచ్చిపోయింది. చైనాలో నియంతృత్వమైంది. ఈస్టర్న్ యూరప్ దేశాలు పేదరికంలో మగ్గుతున్నాయి. అవుట్ డేటెడ్ అయిపోయిన కమ్యూనిజాన్ని పట్టుకుని ఎందుకు వేలాడుతున్నారో అర్థం కావడంలేదు. మీ కాలంలోలాగా ఇప్పుడు పనీపాట లేకుండా ఎవరూ లేరు. టెన్త్ చదివినవాళ్ళు కూడా కనీసం డెలివరీ బాయ్స్‌గా అయినా పనిచేస్తున్నారు. నీ వెనక ఎవరు వస్తారు? జండాలు మోసీ మోసీ మీ భుజాలు కాయలు కాసి వుంటాయి. ఉపయోగం ఏదైనా ఉందా? మీ తాతయ్య ఫ్రీడం ఫైట్‌లో పాల్గొని దెబ్బలు తిన్నాడు అంటే సార్థకత ఉంది. మీరు త్యాగాలు అనుకుంటున్న వాటికి ఏ సార్థకత ఉంది? ఇంకోసారి ఇలా దెబ్బలకి మందురాసుకుంటూ కనిపిస్తే మాత్రం ఊరుకోను జాగ్రత్త" మానిని తలుపు విసురుగా వేసి వెళ్ళిపోయింది.

సమత నిశ్చేష్టురాలై చూస్తూండిపోయింది.

మానిని అరుపులు ఇల్లంతా ధ్వనించాయి కాబట్టి ఊరినించి వచ్చినవాళ్ళు నిశ్శబ్దంగా నిష్క్రమించారు.

అర్ధరాత్రి పేపర్ పని చూసుకుని ఇంటికి వచ్చిన పాండురంగం భార్యని చూసి కంగారుగా అడిగాడు.

“ఏమైంది? దెబ్బలు బాగా తగిలాయా? రేపు మన పత్రికలో ముందు పేజీలో హెడ్ లైన్ ఇదే. నీ ఫోటో కూడా వస్తుంది."

సమత అతని వంక నిర్లిప్తంగా చూసి చెప్పింది.

"ఆకలేస్తోంది. మీ కామ్రేడ్ ఇంటికి వెళ్ళి తినొద్దామా?"

"ఏమ్మాట్లాడుతున్నావ్? వంట చేయకపోతే ఆర్డర్ చేయాల్సింది." పాండురంగం కోపంగా అరిచాడు. అతనికీ విపరీతమైన ఆకలి.

"ఏం పెట్టి వంట చేయను? నువ్వూ, నేనూ సంపాదించిన ఒక్కరూపాయి కూడా నా దగ్గరలేదు. నాన్న సంపాదన ఇక తినదల్చుకోలేదు" సమతకూడా అరిచింది.

పాండురంగం భార్యవంక విచిత్రంగా చూసాడు.

"కొత్తగా మాట్లాడుతున్నావు. ఏమైంది నీకు?"

"జ్ఞానోదయం. ముందు మనం మన కాళ్ళమీద నిలబడితే తర్వాత లోకాన్ని ఉద్ధరిద్దాం. నేను రేపటినించి పనిమనిషి జాబో, వంటమనిషి పనో చేస్తాను. నీ కూతురు నా కళ్ళు తెరిపించింది. నువ్వూ నీ చాకిరికి జీతం తీసుకుంటే బెటర్."

"మారు ఏమన్నా అందా?" పాండురంగం కోపంగా అడిగాడు. అతను కూతుర్ని అదే పేరుతో పిలుస్తాడు.

"చాలా అంది. ప్రస్తుతం కడుపు నింపే పని చూస్తే, తర్వాత వివరంగా చెప్తాను" సమత నిస్పృహగా చెప్పింది.

"ఈ కాలం పిల్లలు ఎందుకింత స్వార్ధపరుల్లా తయారవుతున్నారు?" పాండురంగం ఆలోచనగా అడిగాడు.

"మనమూ కాలంతోపాటు మారాలేమో. ఎంతకాలమని ఏటికి ఎదురీదుతాం?" సమత ప్రశ్నించింది.

"మన రోజుల్లో దేవుడు లేడు, దయ్యం లేదు. మనిషికి తన మీద నమ్మకం ఉండాలి అని వాదించేవాళ్ళం. ఈ కాలం పిల్లలు ప్రతీదానికి దేవుడిమీదే ఆధారపడ్డారు. మారు కూడా పరీక్షలు అనగానే గుళ్ళో కొబ్బరికాయలు కొట్టేది. రోడ్లమీద అయ్యప్ప డ్రెస్‌లలో కనపడే వాళ్ళలో ఎనభై శాతం యువతే ఉంటున్నారు. వీళ్ళకి తమమీద తమకి నమ్మకం లేదు. చదివితే పాసయ్యాం అనుకోవడంలేదు. దేవుడికి మొక్కితే పాసయ్యాం అనుకుంటున్నారు."

"వాళ్ళకి దేవుడి మీద ఉన్న భక్తే మనకి మార్క్సిజం మీద ఉందేమో? ఒకసారి ఆలోచించు. విద్యార్ధులుగా ఇరవైలలో మనం ఈ పిచ్చిలో పడ్డాం. ఏభైలలోకి వచ్చాం. కానీ ఏం సాధించాం? రూపాయి సంపాదన లేకుండా జీవితమంతా పార్టీకి అర్పించేసాం. దెబ్బలు తిన్నాం. నువ్వు తెల్లారుఝామున పడుకుని సాయంత్రాలు లేస్తావు. మెలకువగా ఉన్న సమయాన్ని న్యూస్ పేపర్ ఆఫీస్‌లో గడిపేస్తావు. నేను పగలంతా రోడ్ల మీద తిరుగుతాను. మీ వాళ్ళు వెలేసారు. మా నాన్న మానిని పేరు మీద పెట్టినదాని వడ్డీలు తింటున్నాం. అది అన్నట్లు నా పేరున ఉంటే ఏనాడో ప్రజలకి ఇచ్చేసేవాళ్ళం. మనకి ప్రతిఫలమేది? నా కూతురికి దండల పెళ్ళి చేస్తాను అని చెప్తావు. దానికి పీటలమీద పెళ్ళి చేసుకోవాలని ఉంటే? ఐనా ఇతరుల భావజాలాన్ని మార్చాలని మనమెందుకు తాపత్రయపడుతున్నాం?" సమత ఆవేశంగా అడిగింది.

"పిల్ల ఏదో అందని మూర్ఖంగా మాట్లాడకు. ప్రపంచంలో సమానత్వం గురించి చెప్పింది ఒక్క మార్క్సిజమే" పాండురంగం ఖండించాడు.

"మానిని అన్నట్లు మన లీడర్స్‌కి, మనకి మధ్య ఉందా? ఆలోచించు. పొద్దున ధర్నా చేసినప్పుడు ఒక కానిస్టేబుల్ నాతో ఏమన్నాడో తెలుసా? 'రెండో వైపునించి కూడా ఆలోచించాలమ్మా. ఒకవైపు విని నిర్ణయం తీసుకోకూడదు. వీడు ఓ పాపని ఆటోలో స్కూల్ కి తీసుకెళ్తాడు. ఆ అమ్మాయి వీడు మిస్ బిహేవ్ చేసాడని వాళ్ళ నాన్నతో చెపితే ఆయన వీడిని తిట్టి మానిపించాడట. దానికి కులం పేరుతో దూషించాడని కేస్ పెట్టి అల్లరి చేస్తున్నారు. నీకే ఒక కూతురుంటే వీడిలా చేస్తే ఊరుకుంటావా?' అన్నాడు. దాంతో నేను ఇంటికి వచ్చేసాను .వాళ్ళ కుటుంబం కూడా నాతో మనింటికి వచ్చి వండుకుని తిని గదుల్లోకి వెళ్ళి పడుకున్నారు. మానిని వచ్చి తన గదిలో ఎవరో పడుకున్నారని గొడవ చేసింది. వాళ్ళకి మనం ఇంత చనువు ఎందుకు ఇచ్చాం రంగా? మన బాస్‌లకి పెద్ద భవంతులు ఉన్నాయి కదా. అక్కడికి ఎందుకు పిలవరు?"

పాండురంగం మాట్లాడలేదు.

"నిన్న ఒకామెని గవర్నమెంట్ హాస్పిటల్‌లో చేర్చుకోకపోతే రోడ్డుమీదే ప్రసవించింది. పార్టీ నన్ను ఆందోళనకి పిలిచింది. అప్పుడు అక్కడ పనిచేసే నర్స్ నన్ను పురుగుని చూసినట్లు చూసి చెప్పింది. 'మా కేరళ నాశనమవడానికి కారణం మీ కమ్యూనిస్ట్‌లే. మాకు ఒక్క ఇండస్ట్రీ కూడా ఎందుకు లేదు? యూనియన్లు అంటూ మీరు దూరిపోతారు. కాబట్టి ఆడవాళ్ళం నర్సుల్లా దేశాలు పట్టుకుని, మగాళ్ళు గల్ఫ్‌కి ఎందుకు పోతున్నాం? మా రాష్ట్రంలో ఉపాధి లేక మీ కమ్యూనిస్టులు బ్లాక్ మెయిలర్స్. ఒకళ్ళు పచ్చగా ఉంటే చూడలేరు.

"నిన్న, ఈ రోజు అనుభవాలతో, దెబ్బలతో నేను మానసికంగా శారీరకంగా బాధపడుతుంటే మానిని వచ్చి దాన్ని ఇంకాస్త ఎక్కువ చేసింది. ఆలోచిస్తే వెస్ట్ బెంగాల్ పాడవడానికి కారణం కూడా మన పార్టీలే అనిపిస్తోంది. నిజంగానే కమ్యూనిజం అవుట్ డేటెడ్ అయిపోయింది. రేపే పార్టీకి నా రాజీనామా పంపిస్తున్నాను. నావరకు నేను సంపాదించుకోగలను. ఇక నీ పోషణ గురించి నువ్వే ఆలోచించుకోవాలి. పెట్టుబడిదారు, బూర్జువా అయిన మా నాన్న సంపాదనని తినడం ఇక మానేద్దాం" సమత స్థిరంగాచెప్పింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments